సాక్షి శ్రీకాకుళం

గురువారం । 11 । ఏప్రిల్ । 2024



నగదు స్వాధీనం

ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ తనిఖీలను ముమ్మరంగా చేస్తున్నారు. బుధవారం రశీదులు లేని నగదును స్వాధీనం చేసుకున్నారు. -IIలో



చిన్నారులపై తేనెటీగలు దాడి

కాశీబుగ్గ: మందస మండలం లింబుగాం గ్రామంలో తేనెటీగల దాడిలో ఇద్దరు చిన్నారులు తీవ్రంగా గాయపడ్డారు. తల్లితో కలిసి దేవాలయానికి వెళ్తున్న క్రమంలో తేనెటీగలు దాడికి పాల్పడ్డాయి. ఇద్దరినీ పలాస సీహెచ్‌సీకి తరలించి చికిత్స అందిస్తున్నారు.

సిలబస్‌లో మార్పులు అవసరం

ఎచ్చెర్ల క్యాంపస్: ఉపాధి, ఉద్యోగ అవకాశాలు లక్ష్యంగా సిలబస్‌లో మార్పులు అవసరమని అంబేడ్కర్ వర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ కె.ఆర్.రజిని అన్నారు. వర్సిటీలో ఫిలాసఫీ అండ్ రెలీజియన్ స్టడీస్, జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్ సిలబస్‌ల్లో మార్పుపై సమీక్ష నిర్వహించారు. జాతీయ విద్యా విధానం-2020కి అనుగుణంగా ప్రతి కోర్సులోనూ మార్పులు చేయాలని నిపుణులు అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ సుజాత, రెక్టార్ అడ్డయ్య పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

హోమ్ ఓటింగ్‌పై అవగాహన

ఆమదాలవలస రూరల్: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా హోమ్ ఓటింగ్‌పై ప్రతిఒక్కరికీ అవగాహన ఉండాలని ఆర్వో, జాయింట్ కలెక్టర్ నవీన్ అన్నారు. ఆమదాలవలస మండలం కొర్లకోట సమీపంలోని ఓ ప్రైవేట్ కల్యాణ మండపంలో బుధవారం హోమ్ ఓటింగ్ విధులపై అధికారులకు అవగాహన కల్పించారు. 85 ఏళ్లు నిండిన వారికి, ఇంటి నుంచి బయటకు వెళ్లి ఓటు హక్కు వినియోగించుకోలేని వారికి హోమ్ ఓటింగ్ విధానం అమలు చేస్తున్నామని చెప్పారు. హోమ్ ఓటింగ్ చేసే వారికి ఈ నెల 15, 16 తేదీల్లో ముందుగా తెలియజేసి వారి నుంచి ఆమోదం తీసుకోవాలని సూచించారు. ఇంటి వద్ద ఓటు వేస్తారా లేక పోలింగ్ కేంద్రానికి వచ్చి ఓటింగ్ చేస్తారే అనే దానిని స్పష్టంగా సెక్టార్ అధికారి, బీఎల్వోలు నమోదు చేయాలని తెలియజేశారు. తొలిసారి ఈ విధానం అమలవుతున్న నేపథ్యంలో విజయవంతం చేసేందుకు కృషి చేయాలన్నారు. ఎన్నికల్లో ఎక్కడా తప్పులు జరగకుండా తగు జాగ్రత్తలు పాటించి, ఎన్నికలు సజావుగా జరిపించేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఏఆర్వో, తహసీల్దార్ వేణుగోపాల్, ఎలక్షన్ డీటీ మురళీధర్ నాయక్, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

రంజాన్ శుభాకాంక్షలు



ఆమదాలవలస రూరల్: గాజులకొల్లివలస సమీపంలో సంగమేశ్వర ఆలయం వద్ద బుధవారం సైకతశిల్పి గేదెల హరికృష్ణ వేసిన సైకత శిల్పం ఆకట్టుకుంటుంది. పవిత్ర రంజాన్ పండగ సందర్భంగా సైకత శిల్పం రూపంలో శుభాకాంక్షలు తెలియజేశారు.

జగన్ మళ్లీ సీఎం కావాలని వెంకన్నకు ముడుపు



వేంటేశ్వరస్వామికి ముడుపు కట్టిన ఎత్తురాళ్లపాడు సర్పంచ్, గ్రామస్తులు

కోటబొమ్మాళి: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాలని కోరుతూ కోటబొమ్మాళి మండలం ఎత్తురాళ్లపాడు సర్పంచ్ తలగాన గణపతిరావు నేతృత్వంలో 15 మంది గ్రామస్తులు బుధవారం తిరుమల తిరుపతి వేంటేశ్వరస్వామికి ముడుపు కట్టారు. అనంతరం కోటబొమ్మాళిలో జరిగిన ఎన్నికలకు సిద్ధం సభకు హాజరై సంఘీభావం తెలిపారు. తామంతా జగనన్న పాలనకు ఆకర్షితులమయ్యామని, ఎమ్మెల్యేగా దువ్వాడ శ్రీనివాస్, ఎంపీ పేరాడ తిలక్ భారీ మెజార్టీతో గెలవాలని ఆకాంక్షిస్తున్నట్లు పేర్కొన్నారు. ఎన్నికల అనంతరం జగన్ సీఎంగా ప్రమాణ స్వీకారం చేసిన వెంటనే తిరుపతి వెళ్లి మొక్కులు తీర్చుకుంటామని వారు స్పష్టం చేశారు.



ఆమదాలవలసలోని బయోలాజికల్ ల్యాబ్



ఆమదాలవలస మండలం నెల్లిపర్తిలో ఇంటింటా తాగునీటి కుళాయి కార్యక్రమాన్ని ప్రారంభించిన స్పీకర్ తమ్మినేని సీతారాం

ఆమదాలవలసకు కొత్త వెలుగు

- ఐదేళ్లలో నియోజకవర్గంలో ప్రగతి పరుగు
- రూ.1200 కోట్లతో అభివృద్ధి పనులు
- సంక్షేమ పథకాల లబ్ధి రూ.1830.66 కోట్లు
- మున్సిపాలిటీపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి



రాజకీయంగా అది అత్యంత చైతన్యవంతమైన నియోజకవర్గం. కానీ అభివృద్ధిలో మాత్రం దశాబ్దాలుగా వివక్షకు గురైంది. అటువంటి ఆమదాలవలస నియోజకవర్గ దిశను ఐదేళ్ల వైఎస్సార్‌సీపీ పాలన మార్చేసింది. గత ఆరు దశాబ్దాల్లో సాధ్యం కాని అభివృద్ధి పనులను చేసి చూపించింది. రోడ్లు తదితర మౌలిక సదుపాయాలు మొదలుకొని ఒక ఎత్తిపోతల పథకంతో సహా వంశధార, నాగావళి కాలువల పనులు చేయించడం, అగ్రి ల్యాబ్‌లు వంటి ఆధునిక సౌకర్యాలతో రైతన్నకు అండగా నిలిచింది. ఈ ఐదేళ్లలో రూ. 1830 కోట్ల సంక్షేమ పథకాలు అందించడమే కాక ఈ ఒక్క నియోజకవర్గంలో అక్షరాలా రూ.1200 కోట్ల విలువైన అభివృద్ధి పనులు జరిగాయి.

– ఆమదాలవలస/ఆమదాలవలస రూరల్

దాహార్తి తీరేలా..

- నియోజకవర్గ వాసుల దాహార్తి తీరేలా రూ.158 కోట్ల వ్యయంతో ప్రతి ఇంటికీ తాగునీరు అందించారు. గ్రామాల్లో దీర్ఘకాలిక తాగునీటి సమస్యను వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పరిష్కరించింది.
- జగనన్న కాలనీల కోసం 78 లేవుట్‌లను గుర్తించి 3420 మంది లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలను అందజేశారు. 5354 మంది లబ్ధిదారులకు ఇళ్ల నిర్మాణాల కోసం నిధులు మంజూరు చేశారు.





నిరంతర విద్యుత్..

మండలంలోని గాజుల కొల్లివలస గ్రామ సమీపంలో జగనన్న కాలనీ లేవుట్‌లో రూ.1.60 కోట్ల వ్యయంతో విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణం పూర్తి చేశారు. దాదాపు 20 గ్రామాలకు రెండు మెగావాట్ల విద్యుత్‌ను నిరంతరాయంగా సరఫరా చేస్తున్నారు. వ్యవసాయ కనెక్షన్లకు నిరంతరంగా విద్యుత్‌ను అందించేందుకు ఇది దోహదపడుతోంది.

రైతన్న సంక్షేమమే ధ్యేయంగా..



ఆమదాలవలసలో ఏర్పాటు చేసిన వైఎస్సార్ అగ్రి టెస్టింగ్ ల్యాబ్

కర్షక ప్రయోజనాలే ధ్యేయంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పనిచేస్తోంది. రైతు కోసం జిల్లాలోనే మొదటిసారిగా ఆమదాలవలస పట్టణంలో రూ.1.35 కోట్లతో బయోలాజికల్ ల్యాబ్, నియోజకవర్గ స్థాయిలో రూ.1.50 కోట్లతో అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌లను అందుబాటులోకి తీసుకువచ్చారు. గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసి సేవలందిస్తున్నారు.

సీ గ్రేడ్ టు బీ గ్రేడ్..

- ఆమదాలవలస మున్సిపాలిటీ అభివృద్ధిపై సర్కారు ప్రత్యేక దృష్టిపెట్టింది. 'సీ' గ్రేడ్ నుంచి 'బి' గ్రేడ్‌గా అప్‌గ్రేడ్ చేసింది.
- పట్టణ ప్రధాన రహదారిని రూ.2 కోట్లతో అభివృద్ధి చేశారు.
- మున్సిపాల్టీలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా రూ.2.20 కోట్లతో వివిధ ప్రాంతాల్లో సీసీ రోడ్ల నిర్మాణాలు చేపట్టారు.
- పట్టణంలో రూ.64 కోట్లతో వివిధ ప్రాంతాల్లో తాగునీటి పైప్‌లైన్లు వేశారు.
- పూజారిపేట నుంచి బొడ్డేపల్లిపేట జంక్షన్ వరకు రూ.1.15 కోట్లతో సీసీ రోడ్డు, డ్రైనేజీలు నిర్మించారు.



రూ.95.48 కోట్లతో నాడు-నేడు పనులు..

నాడు-నేడు పథకం ఫేజ్-1,2లలో భాగంగా నియోజకవర్గంలోని పాఠశాలల రూపురేఖలు మార్చారు. ఆహ్లాదకరమైన వాతావరణంలో విద్యార్థుల చదువు సాగేందుకు వీలుగా సౌకర్యాలను కల్పించారు. ఇందు కోసం రూ.95.48 కోట్లు ఖర్చు చేశారు.



బూర్జ మండలం తుడ్డలి గ్రామంలో ఆహ్లాదకరంగా నిర్మించిన ప్రభుత్వ పాఠశాల

రూ.39.50 కోట్లతో రహదారులు..

గత పాలకుల నిర్లక్ష్యంగా కారణంగా శిథిలావస్థకు చేరుకున్న రహదారులపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. నియోజకవర్గంలో రూ.39.50 కోట్లు ఖర్చు చేసి రోడ్లను అభివృద్ధి చేసింది.



ఆమదాలవలస మండలం కణుగులవలస నుంచి ముద్దాడపేట జంక్షన్ వరకు నిర్మించిన రహదారి

ప్రజారోగ్యమే పరమావధిగా..

ప్రజారోగ్య పరిరక్షణే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోంది. ఆమదాలవలస మున్సిపాలిటీలో 27 వార్డులకు గాను రెండు అర్బన్ హెల్త్ సెంటర్ల నిర్మాణాలు చేపట్టారు. దీనికోసం రూ.2.84 కోట్లు ఖర్చు చేశారు.

- సరుబుజ్జిలి మండలం పురుషోత్తపురంలో రూ.2.30 కోట్లతో నూతనంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మించారు.
- బూర్జ మండలంలో పీహెచ్‌సీని రూ.1.78 కోట్ల వ్యయంతో నూతనంగా నిర్మించారు.
- జొన్నవలసలోని 30 పడకల ఆస్పత్రి, గుత్తావిల్లి, తాడివలస, తొగరాం, దూసి, అక్కులపేట, సరుబుజ్జిలి పీహెచ్‌సీలను రూ.7.29 కోట్లతో ఆధునికీకరించారు.

సీఎం రిలీఫ్ ఫండ్..

ఆపదలో ఉన్న పేదవారిని ఆదుకునేందుకు ముఖ్యమంత్రి సహాయనిధి ఎంతో ఆసరాగా నిలిచింది. 130 మంది పేదల వైద్య చికిత్స కోసం రూ.1.30 కోట్లు మంజూరు చేసింది.

సీఎం జగన్ సహకారంతో నియోజకవర్గం అభివృద్ధి



దేశ చరిత్రలో ఎక్కడా లేని విధంగా నవరత్నాల్లాంటి సంక్షేమ పథకాలతో పేద ప్రజల జీవన ప్రమాణాలు, వారి ఆర్థిక స్థితిగతులను మెరుగుపరిచిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుంది. విప్లవాత్మకమైన సంస్కరణలతో విద్య, వైద్యం, వ్యవసాయం అభివృద్ధి పథంలో నడిపించారు. నియోజకవర్గంలో ఎన్నో విద్యా సంస్థలను ఏర్పాటు చేసి ఆమదాలవలసను ఎడ్యుకేషన్ హబ్‌గా తయారు చేశాం. సీఎం జగన్ సహకారంతో ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న నాగావళి నదిపై బలసలరేవు బ్రిడ్జి నిర్మాణ పనులు చేయగలుగుతున్నాం. ప్రతి ఇంటికీ రూ.1 లక్ష నుంచి రూ.15 లక్షల వరకు సంక్షేమ పథకాలు అందించాం. ఐదేళ్ల పాలనలో నవశకానికి నాంది పలకడంతో గడప గడపకు సంక్షేమం అందుతుంది. గడప గడపకు మన ప్రభుత్వం ద్వారా ప్రతి సచివాలయానికి రూ.20 లక్షల మంజూరు చేసి గ్రామాల్లోని సమస్యలు పరిష్కరించాం. ప్రజలంతా మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డిని సీఎం చేయడానికి కృషి చేయాలి.

– తమ్మినేని సీతారాం, శాసనసభ స్పీకర్, ఆమదాలవలస

వైఎస్సార్‌సీపీ హయాంలో లబ్ధి (కొన్ని పథకాలు)

పథకం పేరు	లబ్ధిదారులు	లబ్ధి (రూ.కోట్లలో)
వైఎస్సార్ ఆసరా	44,434	254.41
అమ్మ ఒడి	22,971	91.12
అర్చకులు	67	0.3
జగనన్న చేదోడు	2,238	6.40
క్రాప్ ఇన్సూరెన్స్	9,741	11.67
హౌసింగ్ డీబీటీ	6,028	68.38
రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ	1,263	0.31
జగనన్న వసతి దీవెన	16,341	19.30
జగనన్న విద్యా దీవెన	17,140	34.00
నేతన్న నేస్తం	598	5.37
పింఛన్ కానుక	41,109	381.18
రైతు భరోసా	39,412	183.20
సున్నా వడ్డీ పంట రుణాలు	18,533	4.64
వైఎస్సార్ సున్నా వడ్డీ	49,277	12.70
వైఎస్సార్ ఆరోగ్య ఆసరా	5,771	3.64
వైఎస్సార్ ఆరోగ్య శ్రీ	9,920	35.37
వైఎస్సార్ బీమా	406	11.03
వైఎస్సార్ చేయూత	20,032	114.53
మత్స్యకార భరోసా	12	0.2
కల్యాణమస్తు	103	0.52
కాపునేస్తం	546	1.94
పాస్టర్స్	47	0.16
ఈబీసీ నేస్తం	177	0.56
వైఎస్సార్ వాహన మిత్ర	2,130	7.70
జగనన్న లా నేస్తం	6	0.03

పక్కా భవనాలు..

నియోజకవర్గ వ్యాప్తంగా 28 గ్రామ సచివాలయాలను రూ.11.20 కోట్లతో నిర్మించింది. రూ.10.80 కోట్లతో 27 రైతు భరోసా కేంద్రాలను, రూ.5 కోట్లతో ఆరోగ్య ఉప కేంద్రాలను నిర్మించి అందుబాటులోకి తీసుకువచ్చారు.

- వంశధార కాలువ పనులను, నాగావళి సాగునీటి కాలువ పనులను పూర్తి చేసి రైతులకు సాగునీటిని అందజేస్తున్నారు. పొందూరు మండలం లైదాం వద్ద రూ.6 కోట్లతో ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభించారు.



ఆమదాలవలస పట్టణంలో మోణింగివారి వీధిలో నిర్మించిన అర్బన్ హెల్త్ సెంటర్

కూటమిని ముంచుతున్న మార్పు ప్రచారం

వెనకబడిన టీడీపీ జెట్ స్పీడ్‌లో వైఎస్సార్‌సీపీ..

- శ్రీకాకుళం, పాతపట్నంలలో అయోమయంలో తెలుగు తమ్ముళ్లు
- అభ్యర్థుల మార్పు ప్రచారమే కారణం
- చంద్రబాబు డబుల్‌గేమ్‌తో టీడీపీలో సందిగ్ధత
- ఉండేదెవరో పోయేదెవరో తెలియని పరిస్థితి
- ఎవరివైపు నడవాలో తెలియని దుస్థితిలో కేడర్



పొలిటికల్ స్పాట్ లైట్

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం: కొరవడిన ప్రజాదరణ. అభ్యర్థులపై అసంతృప్తి. అలిగి కూర్చున్న భంగపడ్డ ఆశావహులు. నాయకుల మధ్య విభేదాలతో తమ్ముళ్లు చెరో దారి. ఇదీ టీడీపీలో దయనీయ పరిస్థితి. శ్రీకాకుళం, పాతపట్నం నియోజకవర్గాల అభ్యర్థులను మార్చుతారన్న ప్రచారంతో ఉన్న అభ్యర్థులు పూర్తిస్థాయి నమ్మకంతో ముందుకెళ్లలేకపోతున్నారు. సీటు మార్చి తమకిస్తేనే కదులుతామని టికెట్ కోసం ఆశతో ఉన్న నాయకులు మొండిపట్టుతో ఉన్నారు. ఇరువర్గాల మధ్య పోరులో ఎవరివైపు వెళ్లాలో తేల్చుకోలేక కార్యకర్తలు సందిగ్ధంలో పడ్డారు. అధిష్టానం తుది నిర్ణయం తీసుకున్నాక ఏదో ఒక నిర్ణయం తీసుకుందామన్న ఉద్దేశంలో శ్రేణులు ఉన్నాయి. దీంతో టీడీపీ ఎన్నికల ముందే చతికిలపడిపోయింది.

మార్చుతారా?

శ్రీకాకుళం, పాతపట్నం నియోజకవర్గాల అభ్యర్థులను మార్చే యోచనలో అధిష్టానం ఉందని పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతోంది. అందుకు తగ్గట్టుగానే టిక్కెట్ దక్కక అలక వహిస్తున్న నాయకులకు చంద్రబాబు లోపాయికారీగా ఆశ చూపుతున్నారు. ఇదిగో అదిగో అంటూ రోజులు గడిచిపోతున్నాయి. అయినా స్పష్టత రావడం లేదు. మరోవైపు వైఎస్సార్‌సీపీ దూసుకుపోతోంది. షెడ్యూల్‌కు ముందే అభ్యర్థులను ఖరారు చేసింది. ప్రజాదరణ రోజురోజుకూ పెరుగుతోంది. 2019 ఎన్నికల కంటే మిన్నగా వైఎస్సార్‌సీపీ గాలి వీస్తోంది. సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను చూసి తటస్థులకే కాకుండా టీడీపీ, జనసేన, బీజేపీ నుంచి వలసలు ఊపందుకున్నాయి. ఎక్కడ చూసినా చేరికల సందడే కన్పిస్తోంది. ప్రచార ర్యాలీలు, కార్యక్రమాలు జాతరలా జరుగుతున్నాయి. చెప్పాలంటే వైఎస్సార్‌సీపీ జెట్ స్పీడ్‌తో ముందుకెళ్తోంది.

వేచి చూద్దాం..

శ్రీకాకుళం టీడీపీ అభ్యర్థి గొండు శంకర్‌ను మార్చుతారనే ప్రచారంతో తనకే తప్పకుండా సీటు వస్తుందన్న ఆశతో గుండ లక్ష్మీదేవి ఉన్నారు. ఇండిపెండెంట్‌గా పోటీచేయాలని కేడర్ నుంచి పెద్ద ఎత్తున ఒత్తిడి రావడంతో వారందరికీ సర్ది చెప్పారు. టిక్కెట్ మనకే వస్తుందని అధిష్టానం నుంచి సంకేతాలు ఉన్నాయని.. తొందరపడొద్దని అనుచరులను చల్లబరిచారు.

ఒకవేళ టికెట్ ఇవ్వరనే క్లారిటీ వచ్చాక అందరి అభిప్రాయం మేరకు నడుచుకుంటామని హామీ ఇవ్వడంతో వారి గ్రూపు అంతా ప్రస్తుతం సైలెంటయ్యింది. ప్రచారానికి వెళ్లకుండా అందరూ ఇళ్ల వద్దే ఉంటున్నారు. లక్ష్మీదేవికి టికెట్ వస్తే పనిచేద్దాం.. లేదంటే ఇండిపెండెంట్‌గా ముందుకెళ్దాం..అదీ జరగకపోతే మరోదారి చూసుకుందామని వారంతా వేచి చూస్తున్నారు. కొందరు పార్టీ నిర్ణయం మేరకు వెళ్దామనుకున్నా.. భవిష్యత్‌లో అభ్యర్థిని మార్చేస్తే ఇరకాటంలో పడతామని కుక్కిన పేనులా ఉంటున్నారు. గుండ లక్ష్మీ వర్గం ఇలా ఉంటే.. గొండు శంకర్ కూడా ప్రచారం కన్నా ప్రయత్నాలపై ఎక్కువగా దృష్టి సారించారు. లక్ష్మీదేవి వర్గీయులను తనవైపు తిప్పుకుని, తన వెంట వచ్చేలా రాయబారాలు నెరుపుతున్నారు. ఈ క్రమంలో కొందరు 'ఆఫర్ల'కు ఆకర్షితులై తన చెంతకు చేరుతున్నారు. కాకపోతే, వారంతా బయటపడటం లేదు. ముఖ్యంగా టీడీపీ టికెట్ల ప్రకటన తర్వాత గుండ లక్ష్మీదేవికి దక్కలేదని రోడ్డెక్కి ఆందోళన చేసిన కొంతమంది జారుకున్నారు. ఇప్పుడామె వద్ద కనిపించడం లేదు. లోపాయికారీగా వారంతా గొండు శంకర్ చెంతకు చేరారని పార్టీలో చర్చ జరుగుతోంది.

పాతపట్నంలోనూ అంతే..

పాతపట్నం టీడీపీ అభ్యర్థిగా ప్రస్తుతం మామిడి గోవిందరావు ఉన్నప్పటికీ ఆయన్ని కూడా మార్చుతారనే ప్రచారం జరుగుతోంది. ఇండిపెండెంట్‌గా పోటీ చేస్తానని హడావుడి చేసిన మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణ ప్రస్తుతం వేచి చూసే ధోరణితో ఉన్నారు. దీనికంతటికీ చంద్రబాబు ఇచ్చిన హామీయే కారణమని తెలుస్తోంది. మామిడి గోవిందరావు మాత్రం తనదైన శైలిలో కలమట మనుషులను తనవైపు తిప్పుకునేందుకు ప్రయత్నించినా ఆశించిన ఫలితం దక్కలేదు. టీడీపీ కోసం కనీసం ప్రచారం చేయడం లేదు. అధినేత సీటుపై క్లారిటీ ఇస్తే తప్ప కలమట వర్గీయులు ముందుకు కదిలే పరిస్థితి లేదు. వీరిలో ఒకరిద్దరు పార్టీ స్టాండ్ మేరకు ముందుకెళ్దామని భావించినా చివరికి కలమటకు టికెట్ ఇచ్చేస్తే ఇరకాటంలో పడతామని.. తుది నిర్ణయం వచ్చాక ఏదో ఒక నిర్ణయం తీసుకుందామని యోచిస్తున్నారు.

ఈ విధంగా టీడీపీలో ప్రజాదరణ పక్కన పెడితే ఉన్న నాయకులే ఒక నిర్ణయానికి రాలేకపోతున్న పరిస్థితి నెలకొంది. ఇటు గుండ లక్ష్మీదేవి, అటు కలమట వెంకటరమణ చంద్రబాబు నిర్ణయం కోసం ఎదురు చూస్తున్నారు. ఇప్పటికే కలమట మీడియా ముందుకొచ్చి ఈ నెల 12లోగా తేల్చకపోతే, బహిరంగ సభ పెట్టి నిర్ణయం తీసుకుంటానని వార్నింగ్ కూడా ఇచ్చారు. మరోవైపు లక్ష్మీదేవి కూడా పరిశీలకులు, ఇన్‌చార్జ్‌ల ద్వారా సంకేతాలు పంపిస్తున్నారు. ఎవరుంటారో...ఎవరు పోతారో తెలియని పరిస్థితుల్లో ప్రజల వద్దకు ఎలా వెళ్లగలమని కార్యకర్తలు ఇళ్ల వద్దే ఉండిపోతున్నారు. దీని ప్రభావం ఎన్నికల క్షేత్రంలో స్పష్టంగా కన్పిస్తోంది. వైఎస్సార్‌సీపీ అన్ని రకాలుగా దూసుకుపోతుంటే.. టీడీపీ అభ్యర్థులెవరో తేల్చుకోలేక సొంతింటిని చక్కదిద్దలేకపోతోంది. ఈ పరిణామాలన్నీ వార్ వన్ సైడే చేశాయి. అధికార పార్టీకి పోటీకి ఇవ్వడం లేదు సరికదా.. ఉన్న బలాన్ని పోగుట్టుకున్న పరిస్థితి తెలుగుదేశంలో రోజురోజుకి పెరుగుతోంది.

క్లుప్తంగా

మోడల్ టెక్‌లో ఉద్యోగాలకు ఎంపిక

టెక్కలి: హైదరాబాద్‌కు చెందిన మోడల్ టెక్ టెక్నాలజీ కంపెనీలో ఉద్యోగాలకు టెక్కలి ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు ఎంపికయ్యారు. సివిల్ ఇంజినీరింగ్ కోర్సు పూర్తి చేసిన 16 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికైనట్లు కళాశాల డైరెక్టర్ వి.వి.నాగేశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వీరిని ప్రిన్సిపాల్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, ప్లేస్‌మెంట్ అధికారి ఎంవీఎస్ఎస్.కుమార్ తదితరులు అభినందించారు.

అవలంగి పాఠశాలకు అరుదైన గుర్తింపు


ధ్రువీకరణ పత్రాలతో ఉపాధ్యాయులు, విద్యార్థులు

హిరమండలం: మండలంలోని అవలంగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గ్రీన్ స్కూల్స్ ప్రోగ్రాంలో గుర్తింపు సాధించింది. న్యూఢిల్లీకి చెందిన సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్‌మెంట్ సంస్థ వివిధ అంశాల్లో జాతీయ స్థాయిలో సర్వే చేపట్టింది. పాఠశాలలు అనుసరిస్తున్న విధానాలపై అధ్యయనం చేసింది. పర్యావరణ పరిరక్షణ చర్యల్లో భాగంగా పాఠశాల ఆవరణలో పచ్చదనం పరిశుభ్రత పెంచేలా జీవశాస్త్ర ఉపాధ్యాయుడు డి.ధనుంజయరావు తోటి ఉపాధ్యాయుల సహకారంతో 2022 ఆగస్టు 15 నుంచి విద్యార్థుల జన్మదిన వేడుకలు, ఇతర శుభకార్యక్రమాల నాడు మొక్కలు నాటి సంరక్షణ చేపడుతున్నారు. వీరి కృషిని గుర్తించి పాఠశాలకు జీఎస్పీ ఆడిట్ రేటింగ్ 2024(పసుపు గ్రేడ్)(బెస్ట్ ఆన్ ఆల్ ఇండియా రేడింగ్ ఆఫ్ గ్రీన్ స్కూల్) ఇస్తూ డైరెక్టర్ జనరల్ ఆఫ్ సీఎస్ఈ ఎంపిక చేసింది. ఈ మేరకు సంబంధిత సంస్థ నుంచి ప్రశంసా పత్రం అందిందని హెచ్ఎం బి.గొల్లవాడు బుధవారం తెలిపారు.

'ప్రజలను మోసగించిన బీజేపీకి ఓట్లు వేయాలా?'

జి.సిగడాం: ఎచ్చెర్ల నియోజకవర్గం కూటమి అభ్యర్థి ఎన్.ఈశ్వరరావుకు యువత ఎదురుతిరిగారు. బీజేపీ ప్రభుత్వ హయాంలో నిత్యావసర సరుకులు, పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు పెంచి మధ్య తరగతి కుటుంబాలను నాశనం చేస్తున్న పార్టీకి మేము ఓటు వేయాలా అంటూ ఆనందపురం గ్రామ యువత ఆందోళనకు దిగారు. బుధవారం గ్రామంలో ఎన్నికల ప్రచారానికి వచ్చిన కూటమి అభ్యర్థిని స్థానిక యువకులు నిలదీశారు. కేంద్రంలో రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి మోసగించారని, 2014లోచంద్రబాబు కూడా ఇలాగే మోసం చేశారని మండిపడ్డారు. యువత అడిగిన ప్రశ్నలకు కూటమి అభ్యర్థి సమాధానం చెప్పకుండా జై శ్రీరామ్ అంటూ వెళ్లిపోవడం గమనార్హం.

రైళ్లలో పటిష్ట నిఘా


సిబ్బందితో మాట్లాడుతున్న జీఆర్‌పీ డీఎస్పీ మోహనరావు

కాశీబుగ్గ: పలాస జీఆర్‌పీ రైల్వేస్టేషన్‌ను జీఆర్‌పీ సబ్ డివిజన్ అధికారి బి.మోహనరావు బుధవారం సందర్శించారు. రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటర్లను ప్రలోభపెట్టేందుకు రైలులో అక్రమంగా గంజాయి, మద్యం, డబ్బు, బంగారం తదితర వస్తువులు తరలిస్తుంటారని, రశీదులు లేని వెంటనే వాటిని స్వాధీనం చేసుకోవాలని సూచించారు. నిఘా పటిష్టం చేయాలన్నారు. కార్యక్రమంలో విశాఖ లైన్స్ సీఐ వెంకటరావు, పలాస జీఆర్‌పీ ఎస్ఐ షరీఫ్, సిబ్బంది పాల్గొన్నారు.


ఆమదాలవలస: మెట్టక్కివలసలో ప్రచారం నిర్వహిస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం


వజ్రపుకొత్తూరు రూరల్: బైపల్లిలో మంత్రి అప్పలరాజును ఆశీర్వదిస్తున్న అవ్వాతాతలు


కంచిలి: జాడుపూడి పంచాయతీలో ప్రచారం నిర్వహిస్తున్న ఇచ్ఛాపురం వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పిరియా విజయ


పాతపట్నం: పాశీగంగుపేలో వృద్ధుడితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

మండుటెండలోనూ ప్రజల ముందుకే..

పోలింగ్ సమీపిస్తున్నందున అభ్యర్థులు ప్రచారంలో నిమగ్నమవుతున్నారు. బుధవారం ఎండతీవ్రత ఎక్కువగా ఉన్నప్పటికీ ఇంటింటా ప్రచారం చేపట్టారు. సంక్షేమాభివృద్ధికే పట్టం కట్టాలంటూ వైఎస్సార్ సీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు ఓటర్లకు విజ్ఞప్తి చేశారు.

– సాక్షి నెట్‌వర్క్


ఎచ్చెర్ల: లావేరు మండలం బొంతుపేటలో ప్రచారం చేపడుతున్న ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్

బాబాయ్, అబ్బాయిలకు రాజకీయ సమాధే

- 40 ఏళ్లుగా మీరు చేసింది శూన్యం
- వైఎస్సార్ సీపీ టెక్కలి అభ్యర్థి దువ్వాడ, ఎంపీ అభ్యర్థి తిలక్ ధ్వజం
- కోటబొమ్మాళి ఎన్నికల సిద్ధం సభకు పోటెత్తిన ప్రజలు


సిద్ధం సభలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ టెక్కలి అభ్యర్థి దువ్వాడ శ్రీనివాస్, ఎంపీ అభ్యర్థి పేరాడ తిలక్ (ఇన్‌సెట్లో) కోటబొమ్మాళిలో ఎన్నికల సిద్ధం సభకు హాజరైన భారీ జనం

కోటబొమ్మాళి: మే13న జరగనున్న ఎన్నికల్లో బాబాయ్, అబ్బాయిలు కింజరాపు అచ్చెన్నాయుడు, రామ్మోహన్‌నాయుడులకు రాజకీయ సమాధి తప్పదని వైఎస్సార్ సీపీ టెక్కలి అసెంబ్లీ అభ్యర్థి దువ్వాడ శ్రీనివాస్, శ్రీకాకుళం ఎంపీ అభ్యర్థి పేరాడ తిలక్ అన్నారు. అచ్చెన్న ఆటలు ఇక సాగబోవని స్పష్టం చేశారు. బుధవారం కోటబొమ్మాళి రైతుబజార్ వద్ద ఎన్నికలకు మేం సిద్ధం సభ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ ప్రాంతాన్ని 40 ఏళ్లుగా పాలిస్తున్న కింజరాపు కుటుంబీకులు భావనపాడు పోర్టు తెస్తామని చెప్పి ప్రజలకు మోసం చేశారని, జిల్లాకు ఒక్క శాశ్వత ప్రాజెక్టు తేలేకపోయారని దుయ్యబట్టారు. ప్రజాసేవ పేరుతో ప్రజాధనాన్ని లూటీ చేసి కోట్లాది రూపాయలు దోచుకున్నారని ఆరోపించారు. జగనన్న పాలనలో చేపట్టిన మూలపేట పోర్టు నిర్మాణం శరవేగంగా జరుగుతోందని, అందుబాటులోకి వచ్చిన వెంటనే జిల్లాలోని 20వేల మంది నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు ఇచ్చే బాధ్యత తీసుకుంటామని పేర్కొన్నారు. వలంటీర్ల ద్వారా పింఛన్ పంపిణీ కాక31మంది వృద్ధులు వడదెబ్బతో మృతిచెందారని, ఆ ఉసురు చంద్రబాబుకు తగులుతుందన్నారు. రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కాగా, ఈ సభకు 15వేలమందికి పైగా ప్రజలు హాజరుకావడంతో వైఎస్సార్ సీపీ శ్రేణుల్లో జోష్ కనిపించింది. కార్యక్రమంలో జెడ్పీటీసీ దుబ్బ వెంకటరమణారావు, మండల పార్టీ కన్వీనర్ నూక సత్యరాజు, వైఎస్సార్ సీపీ నాయకులు అన్నెపు రామారావు, రోణంకి మల్లేశ్వరరావు, తలగాన గణపతిరావు, కవిటి రామరాజు, బొడ్డు అప్పన్న, అల్లు కళ్యాణి, జి.నాగభూషణరావు, నేతింటి సింహాచలం, ఎస్.వినోద్, బగాది దివాకర్, కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ ఎస్.హేమసుందరాజు, పీఏసీఎస్ అధ్యక్షుడు బాడాన మురళీధర్, సర్పంచ్‌లు కాల్ల సంజీవరావు, రాంపాత్రుని సావిత్రి, సుంకరి జనార్దన, గురువెల్లి కేశవరావు, రెడ్డి లక్ష్మణ, నేతింటి అప్పలస్వామి, ఎస్.వి.రమణ, సనపల కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

పూటకో మాట మార్చిన వ్యక్తి చంద్రబాబు

- మ్యానిఫెస్టోను గ్రంథంలా భావించే వ్యక్తి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి
- రాజధాని పేరిట టీడీపీ, కొన్ని పత్రికలు డ్రామాలాడుతున్నాయి
- పార్టీ శ్రేణుల సమావేశంలో మంత్రి ధర్మాన ప్రసాదరావు


మాట్లాడుతున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు

గార: పూటకో మాట మార్చిన వ్యక్తి, మ్యానిఫెస్టోను అధికారంలోకి వచ్చాక చించేసే వ్యక్తి చంద్రబాబు అయితే... మ్యానిఫెస్టోను, ఇచ్చిన హామీలను నూటికి 99 శాతం అమలు చేసి పవిత్ర గ్రంథంలా భావించిన నాయకుడు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అని రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. బుధవారం గార మండలం అంపోలు పంచాయతీ లింగాలవలస సమీపంలో గార మండల పార్టీ శ్రేణులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు కంటే మిన్నగా సీఎం జగన్ పనిచేసి నిరూపించుకున్నారని, అందుకే ప్రజల వద్దకు వెళ్లి ఓటు వేయండి అని అడిగే అవకాశం మనకు ఉందన్నారు. ఐదేళ్ల పరిపాలన ఒక ఎత్తు అయితే, ఈ 40 రోజుల మన పని తీరుతోనే మంచి ప్రభుత్వం ఏర్పడుతుందన్నారు. చంద్రబాబు ఆ రోజు వలంటీరు వ్యవస్థ వద్దని చెప్పి ఇప్పుడు మాట మార్చుతున్నారని ధ్వజమెత్తారు. ఆయనకు తోడు సినిమా యాక్టర్ పవన్ కల్యాణ్ వలంటీర్లను ఉద్దేశించి అనుచిత వ్యాఖ్యలు చేశారని గుర్తు చేశారు. ఇప్పుడు వలంటీర్లకు పదివేల రూపాయలు ఇస్తానని చెప్పడం, అవసరార్థం మాటలు హామీలు ఇచ్చి మర్చిపోవడం చంద్రబాబుకు సర్వసాధారణమన్నారు. వలంటీర్లు రాజీనామా చేసి సంఘీభావం తెలుపుతున్నారని, మన ప్రభుత్వం ఏర్పడిన వెంటే రాజీనామా చేసిన వారందరినీ తిరిగి నియమిస్తామని చెప్పారు.

డబ్బులడిగానని నిరూపిస్తే రాజకీయాలు వదులుకుంటా

'ఆమదాలవలస రోడ్డు నిలిచిపోవడానికి నేను డబ్బులు అడిగానని అని ఈనాడు పేపరు రాసింది. ఆ విలేకరికి ఫోన్ చేసి అడిగాను. ఈ ఒక్క రోడ్డే కాదు.. నా రాజకీయ జీవితం 40 ఏళ్లల్లో ఎక్కడైనా ఇలా అడిగానని, అవినీతి అని నిరూపిస్తే రాజకీయాలు వదులుకుంటాను అని చెప్పాను. ఎవరో ఇచ్చిన ముంజేతి డబ్బుల కోసం విలువలు వదిలేసి రాతలు రాయడం ఎంతవరకు కరెక్టు. ఈనాడు, ఆంధ్రజ్యోతి కొన్ని పేపర్లు, చంద్రబాబు, మరికొన్ని పార్టీలు రాజధాని పేరు చెప్పి కుంభకోణం కోసం అధికారంలోకి రావాలని ప్రయత్నం చేస్తున్నారు. అందుకే వాస్తవాలకు దూరంగా వార్తలు వస్తున్నాయి. అబద్ధపు కథనాలు వండి వార్చడం ఎంత మాత్రం ఆహ్వానించదగ్గ పరిణామం కాదు' అని ధర్మాన స్పష్టం చేశారు.

వైఎస్సార్ సీపీ విస్తృతస్థాయి సమావేశం రేపు


ఏర్పాట్లు పరిశీలిస్తున్న కృష్ణదాస్, మజ్జి శ్రీనివాసరావు, పార్టీ ముఖ్య నేతలు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): వైఎస్సార్ సీపీ విస్తృత స్థాయి ఆత్మీయ సమావేశం ఈ నెల 12న నిర్వహిస్తున్నామని పార్టీ జిల్లా అధ్యక్షుడు, నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ తెలిపారు. శ్రీకాకుళం నగరంలోని 80 అడుగుల రోడ్డులో గల ఆనందమయి ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం ఉదయం 10 గంటలకు ఆరంభమయ్యే ఈ సమావేశానికి ఉత్తరాంధ్ర జిల్లాల కన్వీనర్ వై.వి.సుబ్బారెడ్డి, కో-కన్వీనర్ మజ్జి శ్రీనివాసరావులు హాజరవుతారని పేర్కొన్నారు. ఈ మేరకు పార్టీ ముఖ్య నేతలతో కలిసి బుధవారం ఏర్పాట్లు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలోని మంత్రులు, శాసనసభ్యులు, శాసనమండలి సభ్యులు, నియోజకవర్గాల ఇన్‌చార్జిలు, పార్లమెంట్ సభ్యులు, పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జిలు, నియోజకవర్గ పరిశీలకులు, బీసీ కార్పొరేషన్లు, ఏపీ కార్పొరేషన్ల చైర్‌పర్సన్లు, డైరెక్టర్లు, మున్సిపల్ చైర్‌పర్సన్లు, కౌన్సిలర్లు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, మండల పార్టీల అధ్యక్షులు, వైస్ ఎంపీపీలు, మున్సిపల్ వైస్ చైర్మన్లు, పార్టీ అనుబంధ విభాగ అధ్యక్షులు, పార్టీ జిల్లా కార్యవర్గ ప్రతినిధులు, ముఖ్య నేతలు, సర్పంచులు, ఎంపీటీసీలు అంతా హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో తూర్పుకాపు, కళింగవైశ్య కార్పొరేషన్ చైర్మన్లు మామిడి శ్రీకాంత్, అంధవరపు సూరిబాబు, యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు ఎం.వి.స్వరూప్, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు రొతు శంకరరావు, నక్క రామరాజు తదితరులు పాల్గొన్నారు.

భారీగా నగదు స్వాధీనం


నగదు లెక్కిస్తున్న అధికారులు

నరసన్నపేట: ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా ఎటువంటి రసీదులు లేకుండా వాహనాల్లో ఉన్న రూ.5.03 లక్షల నగదును నరసన్నపేట టీడీ గాయిత్రి ఆధ్వర్యంలో ఫ్లయింగ్ స్క్వాడ్ బుధవారం పట్టుకున్నారు. జమ్ము కూడలి వద్ద ఉమ్మిలాడకు చెందిన కొమరి నీలాద్రి నుంచి రూ.4 లక్షలు, మడపాం టోల్‌గేట్ వద్ద లావేరు మండలం పెద్ద లింగాలపాడుకు చెందిన లంక శ్రీనివాసరావు వద్ద రూ.1.03 లక్షలు స్వాధీనం చేసుకుని ఆర్‌ఓకు అప్పగించారు.

- నరసన్నపేట: సంతపేట వద్ద నిర్వహించిన తనిఖీల్లో ద్విచక్ర వాహనదారు నుంచి రూ.2.30 లక్షలను ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం వీవీఎం రాజు స్వాధీనం చేసుకున్నారు. వెండి హోల్‌సేల్ దుకాణంలో పనిచేస్తున్న మెట్ట సంతోష్ ఎటువంటి రశీదులు లేకుండా ఈ మొత్తం తరలిస్తున్న గుర్తించి నగదును ఆర్‌ఓకు అప్పగించినట్లు అధికారులు తెలిపారు.
- ఇచ్ఛాపురం రూరల్: వ్యాన్‌లో ఎటువంటి ఆధారాలు లేకుండా తరలిస్తున్న రూ.2లక్షల 46వేల 810 నగదును ఇచ్ఛాపురానికి చెందిన ఫ్లయింగ్ స్క్వాడ్ పట్టుకుంది. బుధవారం మధ్యాహ్నం బరంపురం నుంచి వ్యాన్‌లో నగదును తరలిస్తుండగా స్థానిక శ్రీరామలింగేశ్వర ఆలయ సమీపంలో వాహనాలు తనిఖీ చేస్తున్న సమయంలో నగదు గుర్తించి స్వాధీనం చేసుకున్నట్లు ఆర్‌ఓ బి.సుదర్శన దొర తెలిపారు.

'ఇంటింటి ప్రచారాలకు అనుమతి అవసరం లేదు'

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఇంటింటా ఎన్నికల ప్రచారానికి ముందస్తు అనుమతి అవసరం లేదని, స్థానిక పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించి ఆయా రాజకీయ పార్టీలు నిర్దేశిత వేళల్లో ఎప్పుడైనా ప్రచారం చేసుకోవచ్చని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి మనజీర్ జిలాని సమూన్ స్పష్టం చేశారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టర్ కార్యాలయంలో బుధవారం 41వ వారపు సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల కమిషన్ నూతన నిబంధనల ప్రకారం ఇంటింటి ప్రచారాలకు ఎలాంటి అనుమతి అవసరం లేదన్నారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు ఎలాంటి సమస్యలున్నా తమకు తెలియజేయాలని, వాటి పరిష్కారానికి ఎన్నికల కమిషన్ చర్యలు తీసుకుంటామని వివరించారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘనలపై ఇప్పటి వరకు 972 ఫిర్యాదులు రాగా వాటిని క్షుణ్ణంగా పరిశీలించి చర్యలు తీసుకున్నామన్నారు. ఏప్రిల్ 18 నుంచి 25 వరకు నామినేషన్ల ప్రక్రియ, 26న పరిశీలన, 29 వరకు ఉపసంహరణ ఉంటుందని వివరించారు. రాజకీయ పార్టీలు అనుమతుల కోసం సువిధ, ఎన్కోర్ యాప్‌లలో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. దివ్యాంగులు, 85 ఏళ్ల పైబడిన, మంచానికే పరిమితమైన వారికి పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం కలిపించామని, ఇది తప్పనిసరి కాదని, మే 12 వరకు హోమ్ ఓటింగ్ సౌకర్యానికి వీరికి అవకాశం ఉంటుందన్నారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు, నాయకులు రొతు శంకరరావు (వైఎస్సార్ సీపీ), పీఎంజే.బాబు (టీడీపీ), సురేష్ సింగ్ (బీజేపీ), లాస సోమేశ్వరరావు (బీఎస్పీ), దేశ్ల గోవింద మల్లిబాబు (కాంగ్రెస్), రట్టి ప్రకాశరావు (సీపీఎం), ఎన్నికల విభాగం అధికారులు పాల్గొన్నారు.

మృత్యుంజయుడు

- బావిలో ప్రమాదవశాత్తు కూరుకుపోయిన అప్పన్న
- గంటన్నర పాటు శ్రమించి కాపాడిన అగ్నిమాపక సిబ్బంది


బావి నుంచి ప్రాణాలతో బయటపడిన అప్పన్న

నరసన్నపేట: అగ్నిమాపక సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించడంతో ఓ వ్యక్తి ప్రాణాలతో బయటపడ్డాడు. వివరాల్లోకి వెళ్తే.. బొరిగివలసకు చెందిన కోనంగి అప్పన్న బుధవారం జమ్ము కూడలి వద్ద కృష్ణానగర్ కాలనీలో కూన ప్రమీల ఇంటి ఆవరణలో ఉన్న పురాతనమైన 25 అడుగుల బావిలో మట్టి తీయడానికి దిగాడు. ఈ క్రమంలో బావి అడుగున ఉన్న నందలు విరిగిపోవడంతో భుజాల వరకు కూరుకుపోయాడు. వెంటనే గమనించిన ప్రమీళ స్థానిక అగ్నిమాపక సిబ్బందికి మధ్యాహ్నం 12.07గంటలకి ఫోను చేశారు. 12.15 కల్లా బావి వద్దకు చేరుకున్న సిబ్బంది పరిస్థితిని పరిశీలించి రోప్ సహాయంతో లోపలికి దిగారు. శిథిలమైన నందల వ్యర్థాలను బకెట్ సహాయంతో తొలగించి అప్పన్నను బయటకు తీసుకువచ్చారు. 1.50 గంటల నిమిషాలకు రెస్క్యూ ఆపరేషన్ పూర్తి చేశారు. తీవ్ర గాయాలతో ఉన్న అప్పన్నను 108 అంబులెన్సులో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ప్రాథమిక చికిత్స అందించారు. ఈ సందర్భంగా అగ్నిమాపక సిబ్బందిని స్థానికులు అభినందించారు. సకాలంలో స్పందించడం వల్లే అప్పన్న గాయాలతో బయటపడ్డాడని, ఆలస్యమైతే ప్రాణాలకే ముప్పు వచ్చేదని స్థానికులు అన్నారు.

సెబ్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి

ఆమదాలవలస: ఎన్నికల నేపథ్యంలో అక్రమ మద్యం రవాణా జరగకుండా సెబ్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సూపరింటెండెంట్ సీహెచ్ తిరుపతినాయుడు అన్నారు. ఆమదాలవలస పట్టణంలోని ఎస్ఈబీ పోలీస్ స్టేషన్‌ను బుధవారం సందర్శించారు. ఇటీవల పట్టుబడ్డ ద్విచక్రవాహనాన్ని బహిరంగ వేలం వేశారు. పలు కేసుల్లో పట్టుబడిన మద్యం సీసాలను ధ్వంసం చేయించారు. అనంతరం బూర్జ మండలం మదనాపురం వద్ద చెక్‌పోస్టును తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఎస్ఈబీ సీఐ కె.రాజారావు, సిబ్బంది పాల్గొన్నారు.

- టెక్కలి రూరల్: టెక్కలి ఎస్ఈబీ స్టేషన్‌ను సెబ్ జాయింట్ డైరెక్టర్ డి.గంగాధరం తనిఖీ చేశారు. సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. సమీప కొండప్రాంతాల్లో సారా తయారు కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో టెక్కలి సెబ్ సీఐ రాజశేఖర్ నాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలో భారీగా చేరికలు

కంచిలి/కవిటి: మండలంలోని జాడుపూడి పంచాయతీ బసవపుట్టుగ, కవిటి మండలం బెలగాం పంచాయతీ బసవకొత్తూరు గ్రామాలకు చెందిన 320 కుటుంబాలు టీడీపీని వీడి వైఎస్సార్ సీపీలో బుధవారం చేరాయి. వీరికి స్థానిక సంస్థల ఎమ్మెల్సీ నర్తు రామారావు, ఇచ్ఛాపురం ఎమ్మెల్యే అభ్యర్థి పిరియా విజయలు కండువాలు వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో రాష్ట్ర రెడ్డిక కార్పొరేషన్ చైర్మన్ దుక్క లోకేశ్వరరెడ్డి, ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు ఇప్పిలి లోలాక్షి, ఇప్పిలి కృష్ణారావు, కడియాల ప్రకాష్, మండల పార్టీ అధ్యక్షుడు వజ్జ మృత్యుంజయరావు, సర్పంచ్ పలికల ద్రాక్షాయని, ఎంపీటీసీ సభ్యురాలు జామి జయ, పలికల జయరాం, మద్దిల ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

– ఇచ్ఛాపురం: వైఎస్సార్‌సీపీతోనే సంక్షేమం, అభివృద్ధి సాధ్యమని ఇచ్ఛాపురం ఎమ్మెల్యే అభ్యర్థి పిరియా విజయ అన్నారు. బుధవారం ఇచ్ఛాపురం పట్టణంలో 4వ వార్డుకు చెందిన దట్టి రామారావు, గిరి, దనుంజయ్, నర్తు కృష్ణ, రమేష్‌లతో పాటు 70 కుటుంబాల వారు వైఎస్సార్‌సీపీలో చేరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజలక్ష్మి, క్రిస్టియన్ మైనారిటీ సెల్ జిల్లా అధ్యక్షుడు ప్రత్తి అన్వేష్, ప్రచార విభాగ కమిటీ జిల్లా అధ్యక్షుడు తాడి ఆదిరెడ్డి, పట్టణ అధ్యక్షుడు ప్రకాశరావు పట్నాయక్, జేసీఎస్ అధ్యక్షుడు సాలిన ఢిల్లీ, కౌన్సిలర్లు ప్రేమ్‌కుమార్, మధుమూర్తి, సీహెచ్ జగన్నాయకులు, పార్టీ నేతలు రాంజీ, పిలక సంతు, పరపటి కోటి, నీలాపు డిల్లి, ఎండీ షఫీ, కిరణ్‌బెహరా, శ్రీను, టెంక లోకేష్, శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.


సారవకోట: పార్టీ కండువా వేస్తున్న ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్


వజ్రపుకొత్తూరు రూరల్: పల్లిసారథిలో మంత్రి సీదిరి సమక్షంలో పార్టీలో చేరిన యువకులు, మహిళలు


స్పీకర్ తమ్మినేని సీతారాం సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన కొర్లకోట యువకులు


ఇచ్ఛాపురంలో పార్టీలో చేరిన వారికి కండువాలు వేస్తున్న పిరియా విజయ


వైఎస్సార్ సీపీలో చేరిన బసవపుట్టుగ, బసవకొత్తూరు గ్రామస్తులకు పార్టీ కండువాలు వేస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి పిరియా విజయ, ఎమ్మెల్సీ నర్తు రామారావు


రణస్థలం: ఎమ్మెల్యే కిరణ్ సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరిన పెద్ద కొత్తపల్లి గ్రామస్తులు

- సారవకోట: మండలంలోని అంగూరు గ్రామానికి చెందిన టీడీపీ నేత, జన్మభూమి కమిటీ సభ్యుడు ముదిలి బాలకృష్ణ కుటుంబ సభ్యులతో కలిసి బుధవారం ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. కార్యక్రమంలో పార్టీ మండల కమిటీ అధ్యక్షుడు వరుదు వంశీకృష్ణ, సర్పంచ్‌లు బాడాన కృష్ణారావు, బాబూరావు, నాయకులు రావాడ శ్రీనివాసరావు, పల్లి కృష్ణారావు, వెలమల సింహాచలం పాల్గొన్నారు.
- ఆమదాలవలస: ఎన్నికల్లో పార్టీ గెలుపునకు కృషి చేయాలని స్పీకర్ తమ్మినేని సీతారాం పిలుపునిచ్చారు. కొర్లకోట గ్రామానికి చెందిన 30 కుటుంబాలకు చెందిన యువకులు బుధవారం టీడీపీని వీడి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో కళింగ కార్పొరేషన్ చైర్మన్ దుంపల రామారావు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.
- రణస్థలం: లావేరు మండలం పెద్ద కొత్తపల్లి గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ నాయకులు, మాజీ సర్పంచ్ గట్టెం ఈశ్వర సత్యనారాయణ, హోంజరావు అసిరప్పడు, దుర్గా ప్రసాద్, గొర్లె అప్పలనాయుడు, వాయబోయిన పోలివాడు, ఎ.చంద్రరావులతోపాటు 100 కుటుంబాలు వైఎస్సార్ సీపీలో చేరారు. బుధవారం ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ సమక్షంలో వీరంతా పార్టీలో చేరారు. కార్యక్రమంలో మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు రొక్కం బాలకృష్ణ, జేసీఎస్ కన్వీనర్ మీసాల శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ లుకలాపు శ్రీనివాసరావు, మండల నాయకులు దేశెట్టి తిరుపతిరావు, కొత్తపెద్దపల్లి గ్రామ నాయకులు జనపాల భానోజీరావు, గొర్లె సురేష్, బుగ్గ హరిబాబు, కాకర్ల వెంకటనాయుడు, వాయపోయిన అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.
- వజ్రపుకొత్తూరు రూరల్: పల్లిసారథి పంచాయతీ పరిధిలోని పలు గ్రామాలకు చెందిన 30 మంది బుధవారం వైఎస్సార్ సీపీలో చేరారు. ఎంపీపీ ఉప్పరపల్లి నీలవేణి సమక్షంలో మంత్రి సీదిరి అప్పలరాజు చేతుల మీదుగా పార్టీ కండువా వేసుకున్నారు.